# మా కాపురం

• శ్రీమతి తంగిరాల శకుంతలాదేవి. •

నాకూ మారాణీకీ ప్రతి విషయంలో చిన్న చిన్న పోట్లాటలు రావడం మామూలైంది. ఎవరు సర్దుకుందామని ప్రయత్నించినా ఫలితం సున్నా. ఒంటరి సంసారం కావటం వల్ల పిల్లలతో రాణీకి ఒక్క క్షణం కూడా తీరిక వుండదు. ఏంచేస్తాం. దేవుడు పిల్లలు కావాలని ఏడ్చేవాళ్లకు పిల్లలనివ్వడు. వద్దన్న వాళ్ళకు పిల్లలనిస్తాడు. ఆలోచనలతో కొంచెం కునుకు పట్టింది కుర్చీలో. ఇంతలో.

"ఏమండోయ్! కాస్త పాపని ఎత్తుకోండి వంట సాగటంలేదు" అని కేకేసింది మారాణి.

ఉలిక్కిపడి "ఏమిటి రాణీ"

"కాస్సేపు పాపని ఎత్తుకోండి. కత్తిపీటదగ్గర కొస్తోంది. ఎన్నిమాట్లు అవతలికి తీయను. విసుగొస్తోంది. కాస్త పిల్లను తీసేటందుకన్నా ఎవరూ లేరాయె. తెల్లారే టప్పటికి వంటకావాలి. తెల్లారకముసుపే కాఫీ కావాలి. నా ఒంట్లో ఓపిక చచ్చింది బాబు. నే చెయ్యలేకుండా వున్నాను ఈ సంసారం"

"ఎట్లాగే అంత విసుక్కుంటే. నాదగ్గర వుండదే అది. నీదగ్గర కొస్తానని ఏడుస్తుంది. ఏది ఇట్లా ఇవ్వు" అని పాపని ఎత్తుకొన్నాను.

ఉంటేనా ఒకటే జారటం కిందికి. నేను పైకి ఎత్తుకోవటం, అది కిందికి జారటం. ఇట్లా ఒక పది నిమిషాలు గడిచాయి. నాకు విసుగొచ్చింది. బలంగా ఒక్క లాగాను పాపని. అది పెద్ద పెట్టున ఏడ్పు సాగించిం.

"ఏమిటండీ, పిల్లనట్లా ఏడిపిస్తున్నారా. కాస్సేపన్నా మనస్సుకి స్థిమితం లేదుకదా. ఇట్లా ఇవ్వండి. కాస్త పిల్లనైనా ఆడించలేరు. వంట చెయ్యాలి. పిల్లని ఆడించాలి. నావల్లకాదు బాబూ. ఎన్నాళ్లు. అంతూ తుదా అంటూ వుండాలి సంసారానికి" అని అన్నది విసుగ్గా.

"ఏం చెయ్యమంటావే, చెప్పు. అది చేస్తాను" మూతి అదోలా పెట్టి "నేనేం చెపుతాను నా యిష్టమేముంది"

"చెప్పు ఇహ. నీ యిష్టప్రకారం చేస్తాను. వంటకి మనిషి, నౌకరు ........."

"చేసేవారల్లేనే చెప్పారే!"

"అయినా ఇంద్రభవనంలాంటి ఇల్లు. అనుకున్నవన్నీ కావాలంటే ఎట్లాగే? మనకి వెనకాల భూములు పుట్రా ఏమీ లేవమ్మో. అన్నట్టు నీవు చెప్పిన సిల్కు చీర చూసానే చాలా బాగున్నది. తీసుకురానా?"

"పాపం జ్ఞాపకం పెట్టుకున్నారు సిల్కు చీర. చాలా సంతోషం. తెచ్చినా తేకపోయినా" అని అన్నది ఎంతో సానుభూతిగా.

"నిజంగా చాలా బాగున్నది రాణీ. నువ్వు కట్టుకుంటే చూడాలని వున్నది. ఏమంటావు?"

"నాకేమీ అక్కర్లేదు. ఎన్నాళ్ళనుంచో అడిగితే ఇవ్వాళ జ్ఞాపకం వచ్చింది. ఇహ తేవడానికి ఎన్నాళ్ళు పడుతుందో" అని అన్నది గునుస్తూ.

"ఎల్లుండి జీతాలిస్తారుగా........ అటునుంచి అటే తీసుకొని రానా" అన్నాను భగవంతునిముందు భక్తుడల్లే వినయంగా.

"ఏం అక్కర్లేదు. పెరుగువాళ్లు, పాలవాళ్లు కాచుకుని కూర్చుంటారు. ఉన్నది కాస్త అక్కడ ఖర్చుపెట్టుకొని రాకండి. బాకీలన్నీ తీర్చిన తరువాత చూద్దాం." అని అన్నది సందేహంగా ముఖం క్రిందికి వంచుకొని.

"ఎంత మంచిదానివే రాణీ. నీ లాంటి పెళ్లాం దొరకడం నా పూజాఫలం" అన్నాను ఎంతో సంతోషంతో.

"చాలు చాలు బాబు ఈ స్తోత్రాలు. పిచ్చిదాన్ని చేసి ఆడిస్తున్నారు. మీరు చీరకొనడం నిజమే. నే కట్టుకోవడం

నిజమే. ఏదో ఇట్లా వెళ్ళనీయండి." అని అన్నది నా ఆలోచనలన్నీ అప్పుడే తెలిసినట్టు.

"అదికాదే నువ్వు చెప్పు. నెలకు రెండు వందలు ఏమూలకొస్తాయె. నెలాఖరుకు ఏమీ మిగలటం లేదని నువ్వే చెబుతున్నావా. ఆఖరుకు నా సిగరెట్టు ఖర్చు కూడ నీ చేతిమీదే ఇస్తున్నావు గదా," అన్నాను ఇంటి విషయాలు ఏకరువు పెడ్తూ.

"నేనేమీ అనటం లేదండి. అందుకే కొనుక్కోలేము, కట్టుకోలేము అంటున్నానండి. సరే ఈ మాటలకేంగాని ఆఫీసు మాట మర్చిపోయినట్టున్నారె. టైము అయింది వడ్డించాను. బాబుని దగ్గర కూర్చోపెట్టుకోండి" అని అన్నది సావధానంగా.

"మరి పాపాయో" అన్నాను దాన్ని ఎవరికివ్వటానికి తోచక.

"దాని సంగతి మీకెందుకు నేనున్నానుగా అన్నిటికీ. పాపాయిని ఎత్తుకుంటాను. మీ అందరికీ అన్నాలు పెడతాను, అన్నీ చేస్తాను, తప్పుతుందా మరి" అని అంది కొంచెం నిర్లక్ష్యంగా.

"తప్పదే మన ఇద్దరికీ ఈ సంసారం తప్పదే"

"తప్పించుకుంటే ఎందుకు తప్పదు. మహా చక్కగా తప్పుతుంది''

"అయితే తప్పించుకోవచ్చునంటావు. అదె ఎట్లాగో నీకు తెలుస్తే నాకు చెపుదూ నే బయట పడతాను"

"మీరు మాత్రం సుఖంగా బయట పడాలి. నా సంగతి ఎవరికీ అక్కర్లేదు. రేపు రాత్రి 12 గంటలకి నే నీ ఇంట్లో వుంటానేమో చూడండి. మీ పిల్లలు మీరు ఏమైనా సరే"

"రాత్రి ఒంటరిగా పోతావుటే నేను పిల్లలు నీకు సహాయంగా వస్తాము. ఒకబండి కూడా కుదురుస్తా. రాజమండ్రి వెళ్ళే ట్రైన్ 2 గంటలకు వుందిగా. మీ వాళ్ళ యింటికి వెడదాం. ఏం బాగుందా వుపాయం"

"ఓ చాలా బాగుంది. ఈమాత్రానికి అక్కడికి పోవడమెందుకు ఇక్కడే వుంటే మీరు నన్ను జాగ్రత్తగా చూడొచ్చు సహాయంగా వుంటారు. పొద్దూకులూ మీ సహాయంతోనే ఇన్నాళ్లూ వుండగలుగుతున్నాను"

"పగలక్కర్లేదు. రాత్రిళ్లేకావాలే ఎవరికైనా. రాత్రిళ్లే భయం"

"నాకేం భయంలేదు"

"నీమొఖం. నేను వెడుతున్నాను. సాయంకాలం సినీమాకు పోదాం. రెడీగా వుండు. అప్పుడు ఆలస్యం చేశావంటే కోపం వస్తుంది"

"మీరు చేస్తే.... ........."

"నేను చెయ్యను.తప్పకుండా వెళ్ళాలి. మరచిపోకు. నే వెడుతున్నాను. తలుపేసుకో."

* * *

"ఏంరోయ్, ఎక్కడినుంచి రావడం" అని కేకేశాడు గోపి. నా గుండెలో రాయి పడింది. వీడు పట్టుకుంటే ఒక పట్టాన వదలిపెట్టడు. ఏం చెయ్యాలి. వాడు పిలిచి పలకరిస్తూంటే ఎట్లా వినిపించుకోకుండా వెళ్ళను."

"ఎప్పుడొచ్చావురా గోపీ ఈ వూరు"

"ఇప్పుడె నాలుగు గంటలకి. మీ ఆవిడా పిల్లలూ బాగున్నారా"

"ఆ అంతా బాగున్నాము. కాఫీ తీసుకొన్నావా. రా హొటల్లో కాఫీ తీసుకు పోదాము"

"నే తీసుకున్నారా. ఈ వూళ్ళో డాక్టరు దగ్గర సలహా తీసుకొందామని వచ్చాను"

"ఏమిట్రా నీకు జబ్బు"

"నాకు కాదురా. మా నాన్నకు. బ్రైను కొంచం పాడయినట్లుగా వుందిరా. ఏం చెయ్యాలో తోచటంలేదు. ఈవూళ్ళో పిచ్చాసుపత్రి వున్నదికదూ. ఎట్లా వీలుంటే ఆ చేదామని, సలహా తీసుకుందామని వచ్చానురా. ఏమంటావు"

"అయితే తొందరగా నడు. ఆస్పత్రి కట్టేసేవేళయింది" ఇద్దరమూ నడక ప్రారంభించాము. "ముందు నాకు పిచ్చెత్తుతోంది. ఇవాళ నా రాణీకీ నాకూ పెద్ద యుద్ధమేవుంది. తప్పదు" అని అనుకున్నాను. వాడికి ఈసంగతి చెపితే నవ్వుతాడు. సరే ఇహ భగవంతుడిమీద భారం వేసి ఇద్దరం బయలుదేరాం. రాత్రి ఏడయింది వాడి పని పూర్తి

య్యేటప్పటికి. నాకు ఏక్షణాని కాక్షణం గుండెల్లో దడ బయలుదేరుతోంది. ఆఖరికి నా రాణీ అన్నట్టు జరిగిందే. "ఎంత చిన్నబుచ్చుకుంటుందో, వీడు శనిగాడల్లే తగిలాడు ఏమీ తోచలేదు, వాడు మళ్ళీ ఈ రైలుకి వెడతాడు ఒక్కరోజు కూడా రాణీ యిష్టప్రకారం నడవడానికి వీలు పడటంలేదు. ఏం చెయ్యను."

వాడు నేను బజారు మధ్యకు వచ్చాం. వాడు మద్రాసు వచ్చి పెళ్లానికి ఒక చీరకొని తీసుకొని వెళ్ళకపోతే ఏం బాగుంటుంది అనుకుని, చీరల షాపులోకి దారి తీశాడు. సరే నాక్కూడా మంచి అవకాశం దొరికింది. రాణీకి కూడా చీర ఒకటి కొందామని నిశ్చయించాను. నా దగ్గర డబ్బు లేకపోయింది. వాడినడిగి 50 రూపాయలు తీసుకొని ఒక మంచి సిల్కుచీర, రెండు గౌన్లు తీసుకున్నా. గోపీని రైలు స్టేషనువరకు సాగనంపి, ఇంటికి బయలుదేరా.

తలుపులన్నీ తీసివున్నాయి. ఇంట్లో ఎవ్వరూ కనపడ లేదు. నెమ్మదిగా వంటగదిదాకా వెళ్లాను. రాణీ పక్కింటావిడతో మాట్లాడుతోంది. బాగానే వున్నదనుకున్నా. నేవచ్చినట్టు తెలియచేయడానికి గదిలో కొంచం చప్పుడు చేశాను.

"ఎవరూ" అంటూ మా ఆవిడ వచ్చింది.

ఇంతలో ప్రక్కింటావిడ వెళ్ళిపోయినట్లుగా అలికిడయింది. వస్తూనే "సినీమా చాలా బాగుందికదూ" అని హేళన చేసింది. అలా చేస్తుందని నేమొదటనే ఊహించా.

"రాణీ గోపీ కనపడ్డాడు. వాళ్ళ నాన్నకి పిచ్చెక్కిందట పాపం. డాక్టరు కోసం వచ్చాడు. వాడ్ని పంపించి వచ్చేటప్పటికి యింత ఆలస్యం అయింది. సినీమాకి రేపెడదాంలే"

"నే మొదటే చెప్పాగా. మీ మాటలు నమ్మమని ఎక్కడుంది. నా యిష్టప్రకారం నడవరనికూడ తెలుసు. ఈ చీరలు ఇవన్నీ కూడ ఎందుకు. ఇప్పుడు డబ్బు ఎక్కడిది?"

"డబ్బెక్కడిదైతే నీకెందుకు? చూడు బాగున్నాయా"

"ఈమాట కొనకముందు అడగాలి, కొన్నతరువాత అడిగి ఏం లాభం. ఇప్పుడు బాగుండలేదన్నా మార్చడానికి వీలు లేదుకదా. అయినా సినీమాకి వెళ్ళలేదని నాకు కోపం వస్తుందని కొన్నారుగాని, నిజంగా మనస్ఫూర్తిగా కొనలేదుగద. తరువాత నీపోరు పడలేక కొన్నాను అనటానికి. ఇంతేగా"

"ఇందాక చెప్పలా, చీర బాగుంది నువ్వు కట్టుకుంటే మరీ బాగుంటుందని. ఈ చీర 40 రూపాయలు. రెండు గౌన్లు పాపకి కొన్నాను. ఏం"

"మొత్తం 50 రూపాయలుదాకా అయిందన్నమాట."

"మరేమిటనుకున్నావు. నీ కోపం అంత బాధగావుంటుంది. డబ్బు, ప్రాణం కూడ అవతల పారేయవచ్చును గాని, నీ కోపం, మౌనం భరించలేను"

"నా యుక్తికి మా రాణీ పకపక నవ్వింది"

బ్రతికారా భగవంతుడా అని ఆరోజు తెల్లార్చాం.

"ఇట్లాంటివిచేసే నన్ను పిచ్చిదాన్ని చేస్తున్నా"రని గునిసింది నా రాణీ.

## ఒక బాధ

ఆర్. సోమసుందర్.

ఓ ప్రపంచమా ! నీ పువ్వును నేను గిల్లి పువ్వును నా ఎదకదుమ ముల్లు గుచ్చుకొన్నది.

దినం అంతమొంది తమం నలుదిక్కులూ నప్పుడు ఆ పువ్వు మాడిపోవుటను నేను తిల కాని, నా బాధ మాత్రం ఉపశమింపలేదు.

ఓ ప్రపంచమా ! సగర్వ సౌరభాన్విత కుసుమాలు యెన్నో వస్తాయి నీకు. కాని, పువ్వులను సేకరించే నా కాలం సాంతమొందింది. ఆ తమస్వినిలో నాకు నా గులాబి లేదు.... మరి బాధకూడ ఉపశమింపలేదు.

(రవీంద్రుని "తోటమాలి" నుండి)